
సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు
సోమవారం । 1 । జనవరి । 2024



సోమశిలలో 34.177 టీఎంసీలు

సోమశిల: సోమశిల జలాశయంలో ఆదివారం సాయంత్రానికి 34.177 టీఎంసీల నీరు నిల్వ ఉంది. పైతట్టు ప్రాంతాల నుంచి 22 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.65,230
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.5,858
మూడు శాతం జీఎస్టీతో	రూ.6,034
నవర (8 గ్రాములు)	రూ.48,272

వాతావరణం

గరిష్టం/కనిష్టం
29.5 /22.0

ఆదివారం గాలిలో తేమ 63 శాతం ఉంది. సోమవారం ఉష్ణోగ్రతలు, ఎండతీవ్రత సాధారణంగా ఉండే అవకాశం ఉందని వాతావరణశాఖ అధికారులు తెలిపారు.

అన్ని రంగాల్లో జిల్లా ముందంజ : కలెక్టర్



నెల్లూరు(దర్గామిట్ట): అన్ని రంగాల్లో జిల్లా ముందంజలో ఉందని, ఇదే స్ఫూర్తితో జిల్లా అధికార యంత్రాంగం పని చేసి ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి ఫలాలు ప్రజలందరికీ అందించేందుకు కృషి చేయాలని కలెక్టర్ ఎం.హరినారాయణన్ తెలిపారు. సోమవారం ఆంగ్ల సంవత్సరాదిని పురస్కరించుకుని జిల్లా ప్రజలకు ఆదివారం కలెక్టర్ శుభాకాంక్షలు తెలిపారు. నూతన ఆంగ్ల సంవత్సరంలోనూ అధికారులంతా అంకితభావంతో ప్రజాసంక్షేమం కోసం పనిచేయాలని సూచించారు.

న్యూ ఇయర్ జోష్

- ఆంగ్ల సంవత్సరానికి స్వాగతం పలికిన యువత
- బాణసంచా పేల్చి, కేక్‌లు కట్ చేసి సందడి



నెల్లూరు వీఆర్సీ సెంటర్‌లో సందడి చేస్తున్న యువత

నెల్లూరు(బృందావనం): నూతన ఆంగ్ల సంవత్సరం సందడి ఆదివారం మధ్యాహ్నం నుంచే మొదలైంది. ఆంగ్ల సంవత్సరాదికి స్వాగతం పలికేందుకు నెల్లూరు నగరంలో యువత ఫుల్ జోష్‌తో ఉర్రూతలూగారు. బైక్‌లపై నగర వీధుల్లో తిరుగుతూ హంగామా చేశారు. న్యూ ఇయర్ గ్రీటింగ్స్ తెలిపేందుకు ప్రతి సెంటర్‌లో బేకరీలు, పూలబొకేలు, స్వీట్స్ షాపుల నిర్వాహకులు ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేశారు. విద్యుద్దీపాల అలంకరణలతో షాపింగ్ మాల్స్, దుకాణాలు నూతన సంవత్సర కళాకాంతులను సంతరించుకున్నాయి. అర్ధరాత్రి 12 గంటల సమయంలో గత సంవత్సరానికి వీడ్కోలు పలుకుతూ నూతన సంవత్సరానికి ఆనందోత్సాహాలతో స్వాగతం పలికారు. వీఆర్సీ సెంటర్ వద్ద భారీగా ప్రజలు గుమిగూడి హ్యాపీ న్యూ ఇయర్ అంటూ హోరెత్తించారు. కేక్‌లు కట్ చేసి ఒకరికొకరు శుభాకాంక్షలు చెప్పుకున్నారు. దూరప్రాంతాల్లో ఉండే తమ ఫ్రెండ్స్, కుటుంబ సభ్యులు, సన్నిహితులకు గ్రీటింగ్స్ తెలిపేందుకు యువత వీడియో కాల్స్‌ను ఆశ్రయించారు. నూతన సంవత్సర వేడుకలను తమ కెమెరాల్లో బంధించేందుకు యూత్ ఆసక్తి కనబరిచింది. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా, ఫ్రెండ్లీగా న్యూ ఇయర్ వేడుకలు జరుపుకునేలా పోలీసు యంత్రాంగం తమవంతు కృషి చేసింది. అలాగే ఆంగ్ల సంవత్సరాది సందర్భంగా నూతన వస్త్రాలు కొనుగోలు చేసేందుకు నగరవాసులు ఉత్సాహం చూపారు. దీంతో ఆదివారం షాపింగ్ మాల్స్ జనంతో కిటకిటలాడాయి.

ఫ్రెండ్స్ వాకర్స్ అసోసియేషన్ ప్రమాణ స్వీకారం

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో ఫ్రెండ్స్ వాకర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఆదివారం ప్రమాణ స్వీకారం చేసింది. అధ్యక్ష, కార్యదర్శులుగా బి.రామమోహన్‌రెడ్డి, షేక్ నసీర్ అహ్మద్, కోశాధికారిగా ఎస్.సుబ్బరాయుడు, గౌరవాధ్యక్షుడిగా వి.వెంకటేశ్వర్లు, జాలీవాకర్‌గా మన్నేపల్లి సురేష్ మరో 15 మంది బోర్డు ఆఫ్ డైరెక్టర్లుగా కార్యవర్గం ఏర్పాటైంది.

ఇకపై పింఛన్ కానుక రూ.3 వేలు

నెల్లూరు(పొగతోట): సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్ పింఛన్ కానుక లబ్ధిదారులకు ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో అమలు చేస్తున్నారు. 2024 జనవరి 1వ తేదీ నుంచి పింఛన్ లబ్ధిదారులకు రూ.3 వేల చొప్పున పంపిణీ చేసేలా ఏర్పాట్లు చేశారు. అలాగే జిల్లావ్యాప్తంగా 10,500 కొత్త పింఛన్లను ప్రభుత్వం మంజూరు చేసింది. సోమవారం ఉదయం నుంచి జిల్లావ్యాప్తంగా 3,21,325 మంది లబ్ధిదారులకు రూ.96.20 కోట్ల పింఛన్ నగదును వలంటీర్లు పంపిణీ చేయనున్నారు.

విజయపథంలో సాగుదాం : మంత్రి కాకాణి



నెల్లూరు(దర్గామిట్ట): నూతన ఆంగ్ల సంవత్సరంలోనూ ప్రజలంతా విజయపథంలో సాగాలని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఆకాంక్షించారు. సోమవారం ఆంగ్ల సంవత్సరాదిని పురస్కరించుకుని ఆదివారం మంత్రి జిల్లా ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలంతా ఆయురారోగ్యాలు, సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు.

నేటి పోలీసు స్పందన రద్దు

నెల్లూరు(క్రైమ్): నెల్లూరులోని ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్ హాల్‌లో జరగాల్సిన పోలీసు స్పందన కార్యక్రమాన్ని సోమవారం ఆంగ్ల సంవత్సరాది సందర్భంగా రద్దు చేసినట్లు జిల్లా పోలీసు కార్యాలయ అధికారులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విషయాన్ని ప్రజలు గమనించాలని తెలిపారు.

అక్రమ రవాణాపై కఠిన చర్యలు

- ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి



వెంకటాచలం టోల్‌ప్లాజా వద్ద వాహనాల తనిఖీ చేయిస్తున్న ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి

వెంకటాచలం: నిబంధనలు అతిక్రమించి వాహనాల్లో మద్యం, ఇతరత్రా అక్రమ రవాణా చేసే వారిపై కఠిన చర్యలు తప్పవని ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి హెచ్చరించారు. వెంకటాచలం పరిధిలోని టోల్‌ప్లాజా వద్ద శనివారం అర్ధరాత్రి పోలీస్, సెబ్ అధికారులతో కలిసి ఆయన వాహనాల తనిఖీ చేపట్టారు. ట్రావెల్ బస్సులు, కార్లు, ఇతర వాహనాలను తనిఖీ చేసి అనుమానిత వ్యక్తులను ప్రశ్నించి వారి చిరునామా, వేలిముద్రలు సేకరించారు. ఓ కారులో అక్రమంగా తరలిస్తున్న మద్యాన్ని గుర్తించి పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిత్యం వాహనాల తనిఖీ నిర్వహించి మద్యం, గంజాయి తదితరాలను రవాణా చేసే వారిపై చర్యలు తీసుకోవాలని పోలీసులను, సెబ్ అధికారులను ఆదేశించారు. రాత్రి పూట తిరిగే వాహనాల వేగాన్ని తగ్గించడానికి ఫేస్ వాష్ చేయించాలని, ట్రిపుల్ రైడింగ్, మైనర్ డ్రైవింగ్‌పై స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని సూచించారు.





నేడు జువ్వలదిన్నెకు కేంద్ర మంత్రి రాక

నెల్లూరు(దర్గామిట్ట): కేంద్ర మత్స్య, పశుసంవర్థక, డెయిరీ డెవలప్‌మెంట్ శాఖ మంత్రి పురుషోత్తం రూపాల సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు చెన్నై నుంచి సముద్ర మార్గాన జువ్వలదిన్నెకు చేరుకోనున్నారు. మధ్యాహ్నం 3.30 నుంచి సాయంత్రం 4 గంటల వరకు జువ్వలదిన్నె హార్బర్‌లో మత్స్యకారులతో మాట్లాడతారు. అనంతరం అక్కడి నుంచి ప్రకాశం జిల్లా కొత్తపట్నం వెళ్తారు.

పోర్టులో యూరియా దిగుమతి

ముత్తుకూరు: అదానీ కృష్ణపట్నం పోర్టు ద్వారా యూరియా దిగుమతి జరుగుతున్నట్లు పోర్టు ఉన్నతోద్యోగి ఒకరు ఆదివారం తెలిపారు. అల్టస్ అనే నౌక నుంచి 49,465 టన్నుల యూరియా దిగుమతి జరుగుతోంది. అలాగే బ్రిగెట్ట అనే నౌక నుంచి 55,994 టన్నుల డీఏపీ దిగుమతి జరుగుతోంది. మరో వైపు ఆక్వావిటా లైమ్ అనే నౌక ద్వారా 60,500 టన్నుల ఇనుప ఖనిజం ఎగుమతి జరుగుతోంది. స్టార్ స్కై అనే నౌక నుంచి 70,000 టన్నుల బెరైటీస్ ఎగుమతి చేస్తున్నారు.

న్యూఇయర్ షాపింగ్ సందడి


నెల్లూరులోని సండేమార్కెట్లో కొనుగోలుదారుల కోలాహలం

నెల్లూరు నగరంలో ఆదివారం కోలాహలం నెలకొంది. న్యూఇయర్‌కు షాపింగ్ చేసే వారితో ట్రంకురోడ్డులోని షాపింగ్ మాల్స్‌తో పాటు సండే మార్కెట్‌లోని వస్త్ర దుకాణాలు, స్వీట్ షాపులు కిటకిటలాడాయి.

–సాక్షి ఫొటోగ్రాఫర్, నెల్లూరు


బేకరీలో స్వీట్ల కొనుగోలుదారుల సందడి

అనుమానాస్పద స్థితిలో వివాహిత మృతి

సంగం: మండలంలోని పెరమన పంచాయతీ మజరా జంగాలదొరువులో ఓ వివాహిత అనుమానాస్పద స్థితిలో ఆదివారం మృతి చెందింది. పోలీసుల వివరాల మేరకు..కలిగిరి మండలం చిన్నఅన్నలూరుకు చెందిన పద్మజ(23)ను ఐదేళ్ల క్రితం జంగాలదొరువు గ్రామానికి చెందిన చప్పిడి వెంకటరత్నానికి ఇచ్చి వివాహం చేశారు. వారికి ఐదేళ్ల కుమార్తె, మూడేళ్ల కుమారుడు సంతానం. దంపతులు ఇద్దరూ కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఈ నేపథ్యంలో శనివారం రాత్రి దంపతులిద్దరూ భోజనం చేసి నిద్రించారు. ఆదివారం వేకువన నిద్రలేచిన వెంకటరత్నం భార్యను లేపేందుకు యత్నించిగా లేవలేదు. దీంతో చుట్టుపక్కల వారితో పాటు పద్మజ తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చాడు. పద్మజ తల్లిదండ్రులు గ్రామానికి చేరుకుని తమ కుమార్తె మృతిపై అనుమానాలు ఉన్నాయంటూ సంగం పోలీసులకు ఫిర్యాదు చేశారు. సంగం ఎస్సై నాగార్జునరెడ్డి అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. పద్మజ మృతితో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.


పద్మజ మృతిపై విచారణ చేస్తున్న ఎస్సై నాగార్జునరెడ్డి

ప్రత్యేక గ్రామసభలు నిర్వహించండి

- డీపీఓ సుస్మితారెడ్డి

నెల్లూరు(పొగతోట): గ్రామీణ ప్రాంతాల్లో తాగునీరు, ఇతర అభివృద్ధి పనుల కోసం ప్రణాళికలు రూపొందించేందుకు ప్రత్యేక గ్రామసభలు నిర్వహించాలని డీపీఓ సుస్మితారెడ్డి మండలాధికారులను ఆదేశించారు. ఆదివారం జిల్లా పంచాయతీ అధికారి కార్యాలయం నుంచి ఎంపీడీఓలు, ఈఓపీఆర్డీలు, పంచాయతీ కార్యదర్శులతో డీపీఓ టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. గ్రామ పంచాయతీల్లో బాలల, మహిళల సభలు నిర్వహించాలని సూచించారు. గ్రామ పంచాయతీలో కార్యదర్శి, మండల స్థాయిలో ఎంపీడీఓ, జిల్లా స్థాయిలో జెడ్పీ సీఈఓ నోడల్ అధికారులుగా వ్యవహరిస్తారన్నారు. అభివృద్ధి ప్రణాళికల ప్రక్రియను జనవరి 31వ తేదీలోగా పూర్తి చేయాలని తెలిపారు.

నేడు యథావిధిగా 'జగనన్నకు చెబుదాం'

నెల్లూరు(దర్గామిట్ట): జనవరి 1న కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో, జిల్లాలోని అన్ని మండల కేంద్రాల్లో 'జగనన్నకు చెబుదాం' (స్పందన) యథావిధిగా జరుగుతుందని జిల్లా రెవెన్యూ అధికారి ఎస్.లవన్న ఆదివారం తెలిపారు. జిల్లా ప్రజలు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

నిమ్మధరలు

పొదలకూరు (కిలో)

పెద్దవి: రూ. 25 సన్నవి: రూ.18

పండ్లు: రూ. 6

7న సముద్రతీర కథల పుస్తకావిష్కరణ

నెల్లూరు(బృందావనం): సముద్ర తీర కథలు పుస్తకాన్ని మైపాడు తీరాన గల జ్యోతిర్లింగ ఆలయంలో ఈ నెల 7న ఆవిష్కరించనున్నామని పొట్లూరు సాహిత్య వేదిక ఉపాధ్యక్షురాలు గోవిందరాజు సుభద్రాదేవి తెలిపారు. పొదలకూరు రోడ్డులోని సంస్థ కార్యాలయంలో ఆహ్వాన పత్రికలను ఆదివారం ఆవిష్కరించిన అనంతరం ఆమె మాట్లాడారు. నలుబోలు బలరామయ్యనాయుడు, రచయిత పొట్లూరు సుబ్రహ్మణ్యం, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు



బ్రాయిలర్: రూ.122

లేయర్ రూ.90

బ్రాయిలర్ చికెన్:రూ.220

స్కిన్‌లెస్ చికెన్: రూ.240

లేయర్ చికెన్:రూ.153



















క్లుప్తంగా

విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు

నెల్లూరు(బృందావనం): పేద బ్రాహ్మణ ఉన్నత విద్యా సహాయక ట్రస్ట్ ఆధ్వర్యంలో 100 మంది విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలను అందజేశారు. విజయమహల్‌గేట్ సమీపంలోని చింతా శ్రీరామ్మూర్తి కల్యాణ మండపంలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో ట్రస్ట్ అధ్యక్ష, కార్యదర్శులు వరప్రసాదరావు, యనమండ్ర నాగదేవీప్రసాద్, డాక్టర్ ధీరజ్, సబ్ రిజిస్ట్రార్ భానుమతి, వెంకటసతీష్ తదితరులు పాల్గొన్నారు.

అట్రాసిటీ కేసుపై డీఎస్పీ విచారణ



విచారణ చేస్తున్న డీఎస్పీ వెంకటరమణ

ఉదయగిరి: స్థానిక పంచాయతీ బస్టాండ్ సెంటర్‌లో డిసెంబర్ 29న వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ జీ ఓబుల్‌రెడ్డితో పాటు వైఎస్సార్‌సీపీ దళిత నేతలు గురవయ్య, దావీదుపై టీడీపీ నేతలు మన్నేటి వెంకటరెడ్డి, ముజ్జి లక్ష్మీనారాయణ, జాఫర్‌సాహెబ్ (బాబు) దాడికి పాల్పడిన విషయం తెలిసిందే. ఈ ఘటనకు సంబంధించి గురవయ్య ఫిర్యాదు మేరకు ఉదయగిరి పోలీసులు అట్రాసిటీ కేసు నమోదు చేయగా కావలి డీఎస్పీ వెంకటరమణ ఆదివారం విచారణ చేపట్టారు. గొడవ జరిగిన ప్రాంతాన్ని పరిశీలించి స్థానిక దుకాణదారులను పిలిచి ఘర్షణపై ఆరా తీశారు. పలువురిని సర్కిల్ కార్యాలయానికి పిలిపించుకుని మాట్లాడారు. డీఎస్పీ వెంట సీఐ గిరిబాబు, ఎస్సైలు ఉమాశంకర్, అనూష ఉన్నారు.

ఫన్‌ఫెయిర్ ఎగ్జిబిషన్ ప్రారంభం



నెల్లూరు(బృందావనం): నగరంలోని వైఎంసీఏ మైదానంలో చిల్డ్రన్స్ ఫన్ ఫెయిర్ ఎగ్జిబిషన్‌ను 38వ డివిజన్ కార్పొరేటర్ దాసరి అమృత, వైఎస్సార్‌సీపీ డివిజన్ ఇన్‌చార్జి దాసరి రాజేష్ ఆదివారం ప్రారంభించారు. ఎగ్జిబిషన్ నిర్వాహకుడు ఎస్కే బాబు మాట్లాడుతూ తక్కువ ఖర్చుతో కుటుంబం మొత్తం ఆనందించేలా ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేశామన్నారు. ఎగ్జిబిషన్‌లో డెవిల్ హౌస్, జెయింట్‌వీల్, డ్రాగన్ ట్రెయిన్, వాటర్‌బోట్, బ్రేక్‌డ్యాన్స్ ప్రత్యేక ఆకర్షణ అని చెప్పారు. ప్రతిరోజూ సాయంత్రం 4 నుంచి రాత్రి 10 గంటల వరకు ఎగ్జిబిషన్ ఉంటుందని వివరించారు.

చెప్పింది చేయడమే జగనన్న నైజం

- కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి



సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి

కావలి: చెప్పింది చేయడమే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నైజమని ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని 16వ వార్డులో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఆదివారం ఆయన నిర్వహించారు. గడప గడపకు వెళ్లి ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించి బుక్‌లెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ చంద్రబాబు తరహాలో ఏరుదాటాక తెప్ప తగలేయకుండా ఎన్నికల హామీలను నూరు శాతం వైఎస్ జగన్ నెరవేర్చారని కొనియాడారు. చంద్రబాబు డ్వాక్రా మహిళలకు రుణాలను మాఫీ చేస్తానని హామీ ఇచ్చి మోసం చేస్తే, వైఎస్ జగన్ అధికారంలోకి వచ్చాక నాలుగు విడతల్లో మాఫీ చేసి ఆదుకున్నారని తెలిపారు. వైఎస్సార్ ఆసరా, చేయూత వంటి పథకాలతో మహిళల సంక్షేమానికి కృషి చేశారన్నారు. జనవరి 1 నుంచి పెన్షన్లను రూ.3వేలకు పెంచి అందించనున్నారని చెప్పారు. ఆరోగ్యశ్రీ పరిమితిని రూ. 5 లక్షల నుంచి ఏకంగా రూ. 25 లక్షలకు పెంచడమే పేదల ఆరోగ్యంపై సీఎం జగన్‌కు ఉన్న ప్రేమ, ఆత్మీయతకు నిదర్శనమన్నారు. విజయవాడలో రూ.500 కోట్లతో ఏర్పాటు చేసిన అంబేడ్కర్ 125 అడుగుల విగ్రహాన్ని అట్టహాసంగా ఆవిష్కరణ చేస్తుండడం దళితులపై ఆయనకున్న ప్రేమకు నిదర్శనమన్నారు. నాడు–నేడు ద్వారా పాఠశాలల రూపురేఖలను మార్చారని వివరించారు. వైఎస్సార్‌సీపీ సువర్ణ పాలనను చూసి రాబోయే ఎన్నికల్లో జగన్‌ను సీఎంగా మారోసారి గెలిపించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. మున్సిపల్ కమిషనర్ శ్రావణ్ కుమార్, వైఎస్సార్‌సీపీ నాయకులు పేరం వెంకటేశ్వర్లు, కలికి ప్రభాకర్‌రెడ్డి, పూనూరు శివకుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రాభివృద్ధి, సంక్షేమమే లక్ష్యం

- వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మేకపాటి



సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న సమన్వయకర్త మేకపాటి

కలిగిరి: రాష్ట్రాభివృద్ధి, సంక్షేమమే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని వైఎస్సార్‌సీపీ ఉదయగిరి నియోజకవర్గ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. తెల్లపాడు సచివాలయం పరిధిలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఆదివారం ఆయన నిర్వహించారు. ఇంటింటికి తిరిగి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని వర్గాల్లోని పేదలకు సంక్షేమానికి పథకాలను అమలు చేయడమే కాకుండా సచివాలయ వ్యవస్థ ద్వారా గడప గడపకు చేర్చిన ఘనత సీఎం వైఎస్ జగన్‌దేనన్నారు. భూసమస్యలకు శాశ్వత పరిష్కారం చూపారని వివరించారు. ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.25 లక్షలకు పెంచి పేదల ప్రాణాలకు భరోసా కల్పించారని తెలిపారు. రాష్ట్రాభివృద్ధి, సంక్షేమానికి రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని ఆశీర్వదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు పాలూరు మాల్యాద్రిరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కాటం రవీంద్రారెడ్డి, జేసీఎస్ కన్వీనర్ సుబ్బారెడ్డి, జిల్లా ప్రచార ప్రధాన కార్యదర్శి అంకినపల్లి నరసింహారెడ్డి, ఎంపీటీసీ సభ్యురాలు మారేళ్ల ప్రభావతి, పీఏసీఎస్ చైర్మన్లు శ్రీనివాసులురెడ్డి, మస్తాన్‌రెడ్డి, పాల్గొన్నారు.

6 నుంచి రాష్ట్ర స్థాయి బ్యాడ్మింటన్ పోటీలు

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ సౌజన్యంతో జనవరి 6,7 తేదీల్లో సింహపురి గ్రూపు వ్యవస్థాపకుడు కోట శివరామయ్య మెమోరియల్ రాష్ట్ర స్థాయి బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించనున్నట్లు టోర్నమెంట్ నిర్వాహకుడు కోట సూర్యనారాయణ తెలిపారు. రంగనాయకులపేటలోని పీఎమ్మార్ హైస్కూల్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన టోర్నమెంట్ వివరాలు తెలిపారు. పీఎమ్మార్ హైస్కూల్ మైదానంలో ఫ్లడ్‌లైట్ల వెలుగుల్లో పోటీలను నిర్వహిస్తామని చెప్పారు. 8వ దఫా నిర్వహిస్తున్న ఈ పోటీల్లో విజేతగా నిలిచిన వారికి ప్రథమ బహుమతి రూ.25 వేలు, ద్వితీయ బహుమతి రూ.15 వేలు, తృతీయ బహుమతి రూ.10 వేలు, 4వ బహుమతి రూ.7 వేలు, 5వ బహుమతి రూ.5 వేలు అందజేయనున్నట్లు వివరించారు. ఆసక్తి కలిగిన క్రీడాకారులు ఈ నెల 4లోపు పోటీలకు ఎంట్రీలను పంపాలని కోరారు. వివరాలకు 88863 57777, 94407 35868 నంబర్లను సంప్రదించాలని సూచించారు. జాలీ ఫ్రెండ్స్ అసోసియేషన్ సభ్యులు హనుమంతరావు, సుబ్రహ్మణ్యం, సుకుమార్, శశిధర్‌బాబు, చరణ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరు మీదుగా అమృత్ భారత్

నెల్లూరు(సెంట్రల్): పశ్చిమ బెంగాళ్ రాష్ట్రం మాల్దా నుంచి బెంగళూరుకు రైల్వే శాఖ ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్ నెల్లూరు మీదుగా వెళ్లనుంది. సామాన్య, మధ్య తరగతి ప్రజలకు అందుబాటులో ఉండేలా ప్రధాని నరేంద్రమోదీ ప్రారంభించిన ఈ రైలు జనవరి 1న నెల్లూరుకు రానుంది. ఈ సందర్భంగా ప్రధాన రైల్వేస్టేషన్‌లో రైలుకు స్వాగతం పలికేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు.

ఉరేసుకుని సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ ఆత్మహత్య

లింగసముద్రం: ఉరేసుకుని సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన మండలంలోని పెంట్రాలలో శనివారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్సై ఎం బాజీబాబు వివరాల మేరకు.. పెంట్రాలకు చెందిన చిలకపాటి నవీన్ (25) సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా హైదరాబాద్‌లో ఉద్యోగం చేస్తున్నాడు. రెండ్రోజుల క్రితం స్వగ్రామానికి వచ్చాడు. శనివారం రాత్రి 9.30 గంటల తరువాత నేను ఇంట్లో పడుకుంటాను నీవు బయట పడుకోమని తమ్ముడితో చెప్పి తలుపుకు గడియపెట్టుకున్నాడు. ఆదివారం ఉదయం తమ్ముడు ఎన్నిసార్లు తలుపుతట్టినా తీయలేదు. దీంతో కిటికీలో నుంచి చూడగా నవీన్ ఉరేసుకుని కనిపించాడు. గట్టిగా కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు వచ్చి తలుపులు పగులగొట్టి నవీన్‌ను కిందకు దింపారు. ఆర్థిక కారణాలతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడని భావిస్తున్నట్లు ఎస్సై తెలిపారు. బేల్దారి పనులు చేసుకుంటూ హైదరాబాద్‌లో ఉంటున్న నవీన్ తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. చేతికి అందివచ్చిన కుమారుడు మృతి చెందడంతో తల్లిదండ్రులు, బంధువులు కన్నీరు మున్నీరుగా విలపించారు.

పెన్షనర్లు లైఫ్‌సర్టిఫికెట్లు సమర్పించాలి

నెల్లూరు(బృందావనం): ప్రభుత్వ సర్వీసు పెన్షనర్లు, ఫ్యామిలీ పెన్షనర్లు జీవన్ ప్రమాణ్ లైఫ్‌సర్టిఫికెట్లను ఫిబ్రవరిలోగా సమర్పించాలని స్టేట్ గవర్నమెంట్ పెన్షనర్స్ అసోసియేషన్ జిల్లా శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్‌ఎం గౌస్, ఎస్వీపీఎస్ మూర్తి ఆదివారం తెలిపారు. భక్తవత్సలనగర్‌లోని పెన్షనర్స్ సంక్షేమ సంఘ భవనంలో జనవరి 2 నుంచి ఫిబ్రవరి 29 వరకు ఆన్‌లైన్ సౌకర్యాన్ని కల్పిస్తున్నామని చెప్పారు. పెన్షనర్లు ప్రతిరోజూ ఉదయం 10 గంటల నుంచి హాజరై ఉపయోగించుకోవాలని సూచించారు.

సాక్షి ఫ్యామిలీ
నెల్లూరు
సోమవారం ॥ 1-1-2024

సాధారణంగా కొత్త సంవత్సరం వస్తోంది అంటే ఎన్నో సంబరాలు. సంవత్సరంతో పాటు తమ జీవితాలలో కూడా మార్పు వస్తుందనే ఆశతో అందరిలోనూ ఉత్సాహం ఉరకలెత్తుతూ ఉంటుంది. ఎవరి పద్ధతులలో వారు వేడుకలు జరుపుకుంటూ ఉంటారు. కొత్త సంవత్సరానికి ఆహ్వానం పలుకుతూ ఇళ్ళని, వీధులని, నగరాలని అలంకరిస్తారు. అలంకారాలు, దీపాలు, టపాకాయలు, కొత్తబట్టలు, మిఠాయిలు (ఎక్కువగా కేకు) పంచుకోవటాలు, విందులు, వినోదాలు, శుభాకాంక్షలు. అంటే రాబోయే కాలం ఆనంద దాయకంగా ఉండాలనే ఆకాంక్ష, ఉంటుందనే విశ్వాసం వ్యక్తం చేయటమే వీటిలోని అసలు అర్థం.

కొత్త సంవత్సరం

మంచి మాట

కొత్త ఆశలు, ఆశయాలు



మనిషి ఆలోచించటం మొదలుపెట్టినప్పటి నుండి లెక్కించటం కూడా ప్రారంభించాడు. ప్రకృతిలో వస్తున్న మార్పులని పరిశీలించి, తదనుగుణంగా ఉండటం కోసం కాలాన్ని కూడా గణించటం ప్రారంభించాడు. కాలగణనకి ప్రమాణం ప్రకృతిలో జరిగే పరిణామాలే. కొద్దికాలం జరిగిన తరవాత మళ్ళీ ఇంతకు ముందు ఉన్నట్టే ప్రకృతి కనపడితే ఈ క్రమం ఏమిటి? అన్నది అర్థం చేసుకునే ప్రయత్నంలోనే మనిషి కాలాన్ని లెక్కపెట్టటం జరిగింది. లెక్కపెట్టటం ఎక్కడో అక్కడ ఎప్పుడో అప్పుడు మొదలుపెట్టాలి. ఒక్కొక్క ప్రాంతం వారు వారికి అనుకూలంగా ఉన్న సమయం నుండి లెక్కపెట్టటం మొదలుపెట్టారు. కాలక్రమంలో దానిలో ఒక హేతుబద్ధతని అవలంబించారు. ప్రకృతి ఆహ్లాదకరంగా ఉండే సమయాన్ని కాలాన్ని లెక్కకట్టటానికి మొదలుగా తీసుకున్నారు. పాశ్చాత్యులకి ఆహ్లాదకరంగా ఉండే వసంతం (స్ప్రింగ్) మార్చ్, ఏప్రిల్ నెలలు. మార్చ్ 23 ని సంవత్సర మానానికి ఆదిగా పరిగణించే వారు. తరువాత నెల మధ్యలో ఎందుకని ఏప్రిల్ 1 ని సంవత్సరాదిగా జరుపుకునే వారు. కొన్ని రాజకీయ కారణాల వల్ల అది జనవరి 1 కి మారింది. మార్చ్ మొదటి నెల కనుక డిసెంబర్ 10 వ నెల, నవంబర్ 9 వ నెల, అక్టోబర్ 8 వ నెల, సెప్టెంబర్ 7 వ నెల అయ్యాయి. ఆ పేర్లే నెలల సంఖ్యని తెలియ చేస్తున్నాయి. ఈ కాలెండర్ ని గ్రెగేరియన్ కాలెండర్ అంటారు. అందరికీ తమ కాలెండర్ ఉన్నా, ఇప్పుడు ప్రపంచం అంతా ఈ కాలెండర్‌నే అనుసరిస్తోంది.

ఈ కాలెండర్ ప్రకారం జనవరి ఒకటో తారీకుతో కొత్త సంవత్సరం మొదలు అవుతుంది. సౌరమానాన్ని అనుసరించి ఒక సంవత్సరంలో 365 1/3 రోజులు ఉంటాయి. అందుకని నాలుగు సంవత్సరాలకి ఒక మారు లీప్ ఇయర్ అని ఒక రోజు అధికంగా వస్తుంది. ఆ రోజు తక్కువ రోజులు ఉండే ఫిబ్రవరికి వెడుతుంది.

అయితే ఆనందోత్సాహాలు ఎందుకు? ఇంతకాలం జీవితాన్ని ఆనందంగా గడిపినందుకు. ఆ విధంగా గడిపే అవకాశం భగవంతుడు ఇచ్చినందుకు. సంవత్సరంలో మొదటి రోజు ఏ విధంగా గడిపితే సంవత్సరం అంతా అదేవిధంగా ఉంటుందని అందరి విశ్వాసం.

రెండువేల ఇరవై నాలుగవ సంవత్సరం అందరికీ ఆయురారోగ్య ఐశ్వర్యాలని ఆనందాన్ని ఇతోధికంగా ఇవ్వాలని, ప్రపంచంలో శాంతి నెలకొనాలని ఒకరికొకరం ఆంగ్ల నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుకుందాము.

> అనుభవజ్ఞులైన పెద్దలు చేసే సూచన ఏమంటే జరిగిపోయిన సంవత్సరంలో ఏం చేశాము అని సమీక్షించుకుని, గెలుపోటములని, మానావమానాలని, బేరీజు వేసుకుని, తమ లక్ష్యాలని, లక్ష్యసాధన మార్గాలని నిర్ధారించుకుని, పనికి రానివాటిని పక్కకి పెట్టి, అవసరమైన వాటిని చేపట్టటానికి నిర్ణయించుకో వలసిన సమయం ఇది అని. తమ ఆయుర్దాయంలో మరొక సంవత్సరం గడిచిపోయింది, చేయవలసిన పనులు త్వరగా చేయాలి అని తమని తాము హెచ్చరించుకోవాలి. అందుకే ఎంతోమంది ఒక చెడు అలవాటుని మానుతామనో, కొత్తపని ఏదైనా మొదలు పెడతామనో అని నూతన సంవత్సర నిర్ణయాలని ప్రకటిస్తూ ఉంటారు.

– డా. ఎన్. అనంతలక్ష్మి

మనం అందరం కారణజన్ములం. ఏదో ఒక ప్రత్యేకమైన గొప్ప పని చేసేందుకు ఈ భూమిపై జన్మించాం. ఇంత గొప్ప అవకాశం వృథా చేసుకోకండి. ఈ సంవత్సరం ఏదైనా కొత్త, సృజనాత్మకమైన పని మొదలుపెట్టండి. ఏదైనా కొత్త పని చేయకుండా ఏ సంవత్సరమూ గడచిపోకూడదు. మీకు ఏ కలలూ లేకపోతే, వాటిని నిజం చేసుకోలేరు కదా! ఏ కొత్త ఆవిష్కరణ అయినా ఒక కలతో మొదలవుతుంది. ఉన్నతంగా కలలుగనే, ఆలోచించే స్వేచ్ఛని మీకు మీరు ఇచ్చుకోండి. ఆపై, వాటిని సాధించేందుకు నూరుశాతం ధైర్యంతో, సమర్పణభావంతో పనిచేయండి.

ఒక అసాధ్యాన్ని సాధిస్తా!

ఈ భూమిని మరింత గొప్పగా తీర్చిదిద్దుతా

చాలాసార్లు ఉన్నతమైన కలలు కనేవారిని ఇతరులు అపహాస్యం చేశారు. కానీ వారు వెనక్కు తగ్గకుండా, తమ లక్ష్యాలను సాధించేవరకూ స్థిరంగా నిలబడ్డారు.

మనలో ఉండే ప్రాణశక్తి ప్రవహించేందుకు ఒక దిశను చూపటం అవసరం. దానికి సరైన దిశను చూపకపోతే మీరు గందరగోళంలో చిక్కుకుపోతారు. జీవశక్తి ఒక నిర్దిష్ట దిశలో పయనించేలా చేయాలంటే మనకు నిబద్ధత అవసరం. ఈ రోజున చాలామంది, తమ జీవితానికి ఒక నిర్దిష్టమైన లక్ష్యం, దిశానిర్దేశం లేకపోవడం చేత అయోమయంలో ఉన్నారు. మీరు ఆనందంగా ఉన్నప్పుడు మీ ప్రాణశక్తి తారాస్థాయిలో ఉంటుంది, మరి అంత ఎక్కువగా ఉన్న ఆ ప్రాణశక్తికి, ఎటువెళ్లాలో చెప్పకపోతే, అది అక్కడే చిక్కుకుపోతుంది. ఒకేచోట పేరుకుపోతే ఏమౌతుంది? కుళ్ళిపోయి, పనికి రాకుండా పోతుంది.

ఇక్కడ రహస్యం ఏమిటీ అంటే, మన లక్ష్యం పట్ల నిబద్ధత ఎంత గొప్పగా ఉంటే, దాన్ని సాధించేందుకు అంత గొప్ప శక్తి మనకు లభిస్తుంది. లక్ష్యం ఎంత గొప్పగా ఉంటే, పనులు అంతా సులభంగా, తేలికగా జరిగిపోతాయి. అదే చిన్న లక్ష్యాలు పెట్టుకున్నారనుకోండి, ఎందుకంటే మీలో సామర్థ్యం కొండంత ఉంది, మీరేమో ఈ చిన్న పనిలో ఇరుక్కుపోయారు అనిపించి మీకే చికాకుగా ఉంటుంది.

మీరు సమాజం బాగు కోసం పనిచేస్తున్నప్పుడు, మీరు పది పనులు చేస్తున్నారనుకుందాం. వాటిలో ఒక పనిలో పొరపాటు జరిగినా, మిగతా తొమ్మిది పనులూ చేస్తూ ఉంటే, ఈ మొదటి పనిలో పొరపాట్లు వాటంతట అవే సర్దుకుంటాయి. సాధారణంగా కృప అనేది ఇలా పనిచేస్తుంది. మొదట అవసరమైన వనరులు సమకూరితే, అప్పుడు పెద్ద లక్ష్యం పెట్టుకుని పని చేద్దామమని మనం సాధారణంగా అనుకుంటాం. కాని, మొదట మీ లక్ష్యం గొప్పగా ఉంటే, వనరులు వాటంతట అవే సమకూరుతాయి. మనం పెట్టుకున్న లక్ష్యమే మనకు ఆ శక్తిని బహుమతిగా ఇస్తుంది. మీరు మీ కుటుంబ శ్రేయస్సును లక్ష్యంగా పెట్టుకున్నారనుకోండి, ఆ కుటుంబమే మీకు సహాయం చేస్తుంది. మీరు సమాజం మొత్తానికి గొప్ప పనిచేయాలని సంకల్పించుకుంటే సమాజం మొత్తం మీకు సహాయపడటాన్ని మీరే చూస్తారు. మీకు కావలసిన సహాయం మీరు అడక్కముందే వచ్చి చేరుతుంది.



గురుదేవ్ శ్రీశ్రీ రవిశంకర్

> మనస్సు పూర్తిగా వర్తమానంలో ఉన్నప్పుడు, మీకు సరైన ఆలోచనలు వస్తాయి. లక్ష్యాలు పెట్టుకోవడం మాత్రమే కాకుండా, వాటిని సాధించే విధానం కూడా ప్రణాళిక వేసుకోవాలి. మూడేళ్ళ తర్వాత మిమ్మల్ని మీరు ఎలా చూడాలనుకుంటున్నారు? ఒక ఇరవై ఏళ్ల తర్వాత? నలభై ఏళ్ళ తర్వాత? ఫలితం గురించి ఎక్కువ ఆలోచించకుండా మీ విధిని నూరు శాతం నిర్వర్తించండి.

> మీ నిబద్ధతకు ఆశించిన ఫలితం రావాలంటే సరైన ఆలోచనలు, సరైన చర్యలు రెండూ అవసరమే. మీరు సాధించాలనుకుంటున్న అన్ని విషయాలతో పెద్ద చిట్టా తయారు చేసుకోకండి. స్థూలంగా పరిశీలించి, నిజంగా అవసరమైన కొన్ని లక్ష్యాలను ఎంచుకోండి. మనకు అత్యంత సంతృప్తిని ఇచ్చే వాటిని, దీర్ఘకాలంలో పదిమంది జీవితాలను తీర్చిదిద్దే వాటిని ఎంచుకుని పని చేసినపుడు, మిగిలిన చిన్నాచితక విషయాలు వాటంతట అవే గాడిలో పడతాయి.

సాధారణంగా మనం మనసులో తపన పడుతూ ఉంటాము, కానీ మన చర్యలు నెమ్మదిగా ఉంటాయి. విజయానికి సోపానం ఏమంటే, మనసులో ఓరిమి, పనిలో ఉత్సాహం. అభిరుచిని, వైరాగ్యాన్ని సరిసమానంగా స్వీకరించండి. మీ లక్ష్య సాధనకై ధైర్యంగా ముందుకు సాగండి, అవసరమైనప్పుడు వదిలేయడం కూడా నేర్చుకోవాలి. అపుడు సహజంగా సమృద్ధి చేకూరుతుంది.

మీరు ధ్యానం చేసినపుడు మీరు సూక్ష్మంగా గమనించగలుగుతారు. మీకు పూర్తిగా విశ్రాంతి లభిస్తుంది, అదే సమయంలో బుద్ధి, వివేచన, సద్యఃస్ఫూర్తి వృద్ధి చెందుతాయి. మీరు ఎఱుకతో ఉండి పనిచేస్తే అది సరైన పని అవుతుంది. చెదిరిపోని దృష్టి, సద్యఃస్ఫూర్తితో పనిచేసే మనసు మీ లక్ష్యాన్ని సాధించేందుకు సహాయ పడతాయి. ఒత్తిడి లేని, ఉత్సాహభరితమైన జీవితానికి, మీరు అనుకున్న లక్ష్యాలపై స్పష్టమైన అవగాహనతో పనిచేసేందుకు సరైన మార్గం ధ్యానం.

నిబద్ధత అనేది దీర్ఘకాలంలో ఎప్పుడూ సుఖాన్ని ఇస్తుంది. ఈ ప్రపంచాన్ని మరింత సురక్షితంగా జీవించే అద్భుత ప్రదేశంగా మార్చాలని కంకణం కట్టుకోండి. అసాధ్యమైన కల కనండి!

● ముగ్గు ముచ్చట



ముగ్గులకు ఆహ్వానం



26 చుక్కలు
2 వరుసలు
2 వచ్చేవరకు



గుంటి శైలజ
మూసాపేట
హైదరాబాద్

ముగ్గులు పంపవలసిన చిరునామా: ముగ్గు–ముచ్చట, సాక్షి ఫ్యామిలీ, సాక్షి టవర్స్, రోడ్ నెం.1, బంజారాహిల్స్, హైదరాబాద్–34. ఈ మెయిల్: muggulu.sakshi@gmail.com

సినిమా



● రజనీకాంత్

కన్యాకుమారిలో వేటగాడు

కన్యాకుమారిలో తిరుగుతున్నాడు వెట్టయాన్ (తెలుగులో 'వేటగాడు' అని అర్థం). రజనీకాంత్ హీరోగా టీజే జ్ఞానవేల్ దర్శకత్వంలో రూపొందుతున్న సినిమా 'వెట్టయాన్'. అమితాబ్ బచ్చన్, ఫాహద్ ఫాజిల్, రానా, మంజు వారియర్, రితికాసింగ్, దుషారా విజయన్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఈ సినిమా తాజా చిత్రీకరణ కన్యాకుమారి పరిసరాల్లోని లొకేషన్స్‌లో జరుగుతోందని కోలీవుడ్ సమాచారం. రజనీకాంత్, ఫాహద్ ఫాజిల్‌పై కీలక సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారు. ఈ చిత్రంలో ఓ పోలీసాఫీసర్ పాత్రలో రజనీ నటిస్తున్నారని, నకిలీ ఎన్‌కౌంటర్స్ నేపథ్యంలో ఈ సినిమా కథనం సాగుతుందని సమాచారం. సుభాస్కరణ్ నిర్మిస్తున్న ఈ చిత్రం వచ్చే ఏడాది వేసవిలో విడుదల కానుంది.

గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్‌టైమ్



● విజయ్

విజయ్ హీరోగా నటిస్తున్న కొత్త సినిమాకు 'ది గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్‌టైమ్' అనే టైటిల్ ఖరారైంది. విజయ్ కెరీర్‌లో 68వ సినిమాగా వస్తున్న ఈ చిత్రానికి వెంకట్ ప్రభు దర్శకత్వం వహిస్తున్నారు. ఏజీఎస్ ఎంటర్‌టైన్మెంట్ సంస్థ ఈ సినిమాను నిర్మిస్తోంది. న్యూ ఇయర్ (2024) సందర్భంగా ఈసినిమా టైటిల్, ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను ఆదివారం విడుదల చేశారు మేకర్స్. అలాగే ఈ సినిమాకు సంబంధించిన మరో లుక్ నేడు రానుందని కోలీవుడ్ సమాచారం. ఫస్ట్‌లుక్‌ని చూస్తే ఈ చిత్రంలో విజయ్ ద్విపాత్రాభినయం చేస్తున్నారని స్పష్టమవుతోంది. మీనాక్షీ చౌదరి హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రంలో ప్రశాంత్, లైలా, స్నేహ, జయరాం, యోగిబాబు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ సినిమా ఈ ఏడాది దీపావళి కానుకగా విడుదలకానుందనే టాక్ కోలీవుడ్‌లో వినిపిస్తోంది. ఈ చిత్రానికి యువన్ శంకర్ రాజా సంగీతం అందిస్తున్నారు.



● నరేశ్, నాగార్జున, రాజ్‌తరుణ్

మా జోలికొస్తే నా సామిరంగ!

''మా జోలికొస్తే.. మాకడ్డు వస్తే.. మామూలుగా ఉండదు.. నా సామిరంగ..' అంటూ పాడేస్తున్నారు నాగార్జున. ఆయన హీరోగా నటించిన చిత్రం 'నా సామిరంగ'. విజయ్ బిన్నీ దర్శకత్వం వహించిన ఈ సినిమాలో ఆషికా రంగనాథ్ కథానాయికగా, 'అల్లరి' నరేశ్, రాజ్ తరుణ్ కీలక పాత్రల్లో నటించారు. పవన్ కుమార్ సమర్పణలో శ్రీనివాసా చిట్టూరి నిర్మించిన ఈ సినిమా సంక్రాంతి కానుకగా ఈ నెల 14న విడుదలకానుంది. ఎంఎం కీరవాణి సంగీతం అందించారు. ఈ చిత్రం నుంచి 'నా సామిరంగ..' అంటూ సాగే టైటిల్ సాంగ్ లిరికల్ వీడియోను ఆదివారం విడుదల చేశారు మేకర్స్. చంద్రబోస్ సాహిత్యం అందించిన ఈ పాటను కాల భైరవ, రాహుల్ సిప్లిగంజ్ పాడారు. 'మా జోలికొస్తే మాకడ్డు వస్తే మామూలుగా ఉండదు నా సామిరంగ.., ఈ గీత తొక్కితే మా సేత సిక్కితే మామూలుగా ఉండదు నా సామిరంగ..' అంటూ ఫుల్ జోష్‌లో సాగే ఈ పాటలో నాగార్జునతో కలిసి 'అల్లరి' నరేశ్, రాజ్ తరుణ్ కూడా చిందేశారు. ''మాస్ అండ్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా 'నా సామిరంగ' రూపొందింది. ప్రధాన తారాగణంతో పాటు 300 మంది డ్యాన్సర్స్‌తో లావిష్‌గా చిత్రీకరించిన 'నా సామిరంగ..' పాటకు దినేష్ మాస్టర్ అందించిన నృత్యాలు అద్భుతంగా ఉంటాయి'' అని చిత్రబృందం పేర్కొంది. ఈ చిత్రానికి కెమెరా: శివేంద్ర దాశరధి.



అది మరచిపోలేని జ్ఞాపకం

– శివాత్మిక రాజశేఖర్

''నేను ఎప్పట్నుంచో స్కై డైవింగ్ చేయాలనుకుంటున్నాను. అది 2023లో నెరవేరింది. దుబాయ్‌లో అక్క(శివాని), నేను రెండు వేల అడుగుల ఎత్తు నుంచి స్కై డైవింగ్ చేశాం. 2023 అనే కాదు.. నా జీవితంలోనే నేను మరచిపోలేని జ్ఞాపకంగా ఈ స్కై డైవింగ్ అడ్వెంచర్‌ను గుర్తు పెట్టుకుంటాను'' అని హీరోయిన్ శివాత్మిక అన్నారు. 2023కి వీడ్కోలు పలుకుతూ 2024కి స్వాగతం పలుకుతున్న శివాత్మిక రాజశేఖర్ పంచుకున్న విశేషాలు...

■ **మీ జీవితంలో 2023 ఎలా గడిచింది?**

చెప్పాలంటే... 2023 నాకు గొప్పగా గడిచింది. చాలా విధాలుగా కలిసొచ్చింది. నా కెరీర్ స్టార్టింగ్‌లోనే మంచి ప్రాజెక్ట్స్‌లో భాగమయ్యాననే భావన కలిగింది. ఎప్పట్నుంచో నేను చేయాలనుకుంటున్న పనులు ఈ ఏడాది జరిగాయి. ఎన్నో కొత్త విషయాలు నేర్చుకున్నాను. నన్ను నేను మెరుగుపరచుకోవడం కోసం కొత్త నైపుణ్యాలను నేర్చుకుంటున్నాను. కుటుంబం పరంగా కూడా బాగా గడిచింది. దేవుడి దయవల్ల, అదృష్టంగా 2023 నా జీవితంలో సంతోషంగా ముగిసింది.

■ **ఈ ఏడాది మీ జీవితంలో జరిగిన చెడు ఘటనలు ఏవైనా ఉన్నాయా?**

మంచి జరిగినట్లే... ప్రతి ఏడాది చెడు కూడా ఉంటుంది. అయితే కొత్త సంవత్సరాన్ని మొదలు పెట్టబోయే ఈ తరుణంలో వాటిని నేను గుర్తుతెచ్చుకోవాలనుకోవడం లేదు.

■ **కొత్త ఏడాది కోసం మీరు తీసుకున్న కొత్త నిర్ణయాలు ఏంటి?**

నా మనసును ఎక్కువగా ఫాలో అవుతూ వర్క్స్ చేస్తాను. ప్రతి అంశం గురించి ఎక్కువగా ఆలోచించకుండా ప్రస్తుత క్షణాన్ని ఆస్వాదించేలా జీవిస్తాను. ఇలా గత ఏడాదిలో ప్రయత్నించి సంతోషంగా జీవనం సాగించాను. ఈ ఏడాది కూడా ఇదే ఫాలో అవ్వాలనుకుంటున్నాను.

■ **2024 మీ జీవితంలో ఎలా ఉండాలనుకుంటున్నారు?**

పెద్దగా అంచనాలు ఏమీ పెట్టుకోవడం లేదు. ఫ్లోను బట్టి ముందుకెళ్తాను. అయితే అన్నీ మంచి, గొప్ప అంశాలే జరగాలని కోరుకుంటున్నాను. సంతోషంగా, హాయిగా, ఆరోగ్యకరంగా గడవాలని ఆశిస్తున్నాను.

■ **కొత్త ఏడాదిని ఎలా సెలబ్రేట్ చేసుకోబోతున్నారు?**

కొత్త ఏడాది ఎప్పటిలానే అమ్మానాన్న(జీవిత, రాజశేఖర్), అక్క శివానీలతో హైదరాబాద్‌లోనే సెలబ్రేట్ చేసుకుంటున్నాను. నా స్నేహితులు, ఫ్యామిలీ ఫ్రెండ్స్‌ను కలుస్తాను.



● బెల్లంకొండ సాయిశ్రీనివాస్

యాక్షన్ ఎంటర్‌టైనర్

బెల్లంకొండ సాయి శ్రీనివాస్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'బీఎస్ఎస్ 10'(వర్కింగ్ టైటిల్). 'భీమ్లా నాయక్' మూవీ తర్వాత సాగర్ కె.చంద్ర దర్శకత్వం వహిస్తున్న చిత్రమిది. 14 రీల్స్ ప్లస్ బ్యానర్‌పై రామ్ ఆచంట, గోపీ ఆచంట నిర్మిస్తున్న ఈ సినిమా కీలక షెడ్యూల్ పూర్తయింది. ''యూనిక్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతోన్న చిత్రం 'బీఎస్ఎస్ 10'. భారీ బడ్జెట్‌తో అత్యున్నత సాంకేతిక విలువలతో ఈ సినిమా తెరకెక్కుతోంది. బెల్లంకొండ శ్రీనివాస్‌ని గతంలో ఎన్నడూ చూడని పవర్ ఫుల్ పాత్రలో సరికొత్తగా చూపించనున్నారు సాగర్ కె.చంద్ర. ఈ సినిమాలోని కీలకమైన షూటింగ్ షెడ్యూల్‌ను పూర్తి చేశాం. ఈ చిత్రంలో కొంతమంది ప్రముఖ నటీనటులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ నెల 3న శ్రీనివాస్ పుట్టినరోజు సందర్భంగా ఈ సినిమా టైటిల్, ఫస్ట్ లుక్ విడుదల చేస్తాం'' అని చిత్రయూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: హరీష్ కట్టా, సంగీతం: భీమ్స్ సిసిరోలియో, కెమెరా: ముఖేష్ జ్ఞానేష్.



● మృణాల్ ఠాకూర్



● లారెన్స్

లారెన్స్‌కు జోడీగా..?

హీరో రాఘవా లారెన్స్, హీరోయిన్ మృణాళ్ ఠాకూర్ జోడీ కట్టనున్నారా? అంటే అవుననే అంటున్నాయి ఫిల్మ్‌నగర్ వర్గాలు. రాఘవా లారెన్స్ హీరోగా రమేష్ వర్మ దర్శకత్వంలో ఓ భారీ బడ్జెట్ ఫిల్మ్ తెరకెక్కనుందనే వార్తలు వస్తున్న సంగతి తెలిసిందే. త్వరలోనే ఈ సినిమా షూటింగ్ ప్రారంభం కానుందని టాక్. ఈ చిత్రంలో లారెన్స్‌కు జోడీగా మృణాళ్ కనిపిస్తారనే టాక్ ఫిల్మ్‌నగర్ సర్కిల్స్‌లో లేటెస్ట్‌గా వినిపిస్తోంది. అలాగే ఈ సినిమాకు 'శ్రీరామరక్ష' అనే టైటిల్‌ను కూడా అనుకుంటున్నారట మేకర్స్. కాగా ఈ విషయాలపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.

వాస్తవ ఘటనలతో సర్కారు నౌకరి

ప్రముఖ సింగర్ సునీత కుమారుడు ఆకాష్ హీరోగా పరిచయమవుతున్న చిత్రం 'సర్కారు నౌకరి'.



● ఆకాష్, భావన

గంగనమోని శేఖర్ దర్శకత్వం వహించిన ఈ మూవీలో భావన హీరోయిన్‌గా నటించారు. ఆర్కే టెలీ షో బ్యానర్‌పై డైరెక్టర్ కె.రాఘవేంద్రరావు నిర్మించిన ఈ సినిమా నేడు విడుదలవుతోంది. ఈ సందర్భంగా జరిగిన ప్రెస్‌మీట్‌లో గంగనమోని శేఖర్ మాట్లాడుతూ– ''వాస్తవ ఘటనల స్ఫూర్తితో 90వ దశకం నేపథ్యంలో 'సర్కారు నౌకరి' రూపొందింది. ఇందులోని సందేశం, వినోదం ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది'' అన్నారు. ''సర్కారు నౌకరి'లో ప్రభుత్వ ఉద్యోగి పాత్రలో కనిపిస్తాను'' అన్నారు ఆకాష్. ''ఈ మూవీతో తెలుగులో పరిచయం కావడం సంతోషంగా ఉంది'' అన్నారు భావన.

దూడుం దుక్కుడుం బాగుంది

– జీవీ ప్రకాశ్ కుమార్



● శ్రీనాథ్, జీవీ ప్రకాశ్ కుమార్, ప్రణవ్, షాజ్ఞ, భువన్ రెడ్డి

''ప్రభుత్వ జూనియర్ కళాశాల పుంగనూరు–500143' చిత్రంలోని 'దూడుం దుక్కుడుం..' పాట బాగుంది. ఈ సాంగ్‌కి క్లాసికల్ టచ్ ఇవ్వడం బాగా నచ్చింది. ఈ సినిమాలోని ఇతర పాటలు ఎలా ఉంటాయో అని ఆసక్తి పెరిగింది. ఈ చిత్రం తప్పకుండా మ్యూజికల్ హిట్ అవుతుంది'' అని సంగీత దర్శకుడు, నటుడు జీవీ ప్రకాశ్ కుమార్ అన్నారు. ప్రణవ్ సింగంపల్లి, షాజ్ఞ శ్రీ వేణున్ జంటగా శ్రీనాథ్ పులకురం దర్శకత్వం వహించిన చిత్రం 'ప్రభుత్వ జూనియర్ కళాశాల పుంగనూరు– 500143'. కొవ్వూరి అరుణ సమర్పణలో బ్లాక్ యాంట్ పిక్చర్స్‌పై భువన్ రెడ్డి కొవ్వూరి నిర్మించిన ఈ సినిమా రిలీజ్‌కి సిద్ధంగా ఉంది. కార్తీక్ రోడ్రిగ్జ్ సంగీతం అందించిన ఈ చిత్రంలోని 'దూడుం దుక్కుడుం..' పాటని జీవీ ప్రకాశ్ కుమార్ విడుదల చేశారు. శ్రీ సాయి కిరణ్ సాహిత్యం అందించిన ఈ పాటను మంగ్లీ పాడారు. ఈ చిత్రానికి కెమెరా: నిఖిల్ సురేంద్రన్, నేపథ్య సంగీతం: కమ్రాన్.